# అందమైన అనుభవం

— ఎన్. రాఘవేంద్రరావు



"మీకెవరి మీదనైనా మనసుపడిందా? ఎవరైనా వున్నారా? నేనుమీకు అడ్డా?"

రోదిస్తున్న ఆమె ముఖంలోకి ఆర్నెల్లతర్వాత మొట్టమొదటగా చూశాడు శ్రీహరి. ఆమె ఆ చూపుకే పరవశించిపోయింది! ఆమె ... అరుంధతి.

"పరాయి ఆడవాళ్ళను కంటితో చూస్తాను గాని పన్నెత్తి మాట్లాడను ... నీకు తెలుసుగా. ఎందుకో ... మన పెళ్ళయిన తొలిరోజుల్లోలా నువ్వు 'బ్యూటీ'గా కనిపించడం లేదు. ఎంత అలంకరించుకున్నా అంతే! ఒక విధంగా చెప్పాలంటే నీ మీద మోజు కలగడం లేదు. అది నీ ఖర్మో, నా అవివేకమో నాకే అర్థకావడం లేదు."

శ్రీహరి ఆమె చెప్పబోయే మాట గురించి గాని, ఆమె చూడబోయే అర్థవంతమైన చూపు గురించిగాని చూడకుండా గబగబా సూట్‌కేస్‌తో వెళ్ళిపోయి టాక్సీ ఎక్కాడు.

అరుంధతి పిచ్చిగా నవ్వుకోవాలో, గట్టిగా ఏడ్వాలో అర్థంకాక కొయ్యబొమ్మలా నిలబడిపోయింది.

'ఏ స్త్రీకయినా మగవాడిని తన అలంకరణలతో మెప్పించి అతని ప్రేమానురాగాలని పొందడం ఎంత ముఖ్యమో ... అదే మగవాడికి తను నలిగిపోయి తన ప్రేమ కానుకగా ప్రతిబింబాల్లాంటి పిల్లలను అందివ్వడం కూడా ముఖ్యాతి ముఖ్యమైన విషయం' అన్న సాధారణ సంసారనీతి అరుంధతికి ఎవ్వరూ చెప్పకుండా తెలిసిన పాఠం!

'ఆ పాఠాన్ని పాటించడం కోసం శారీరక అందాలు హరించబడతాయని తెలిసుండి కూడా ఆమె తన శరీరాన్ని అతని సుఖం కోసం త్యాగంచేసి, గర్భం ధరించి, పిల్లలను కని, వాళ్ళ పోషణలో నిమగ్నమై భర్తకు కొంచెం అన్యాయం చేస్తే అది తప్పా?'

అరిగిపోయిన చెప్పుగా స్త్రీని జమకట్టే ఈ మగవాడికే కడుపొచ్చి పిల్లలను కనే ఏర్పాటు ఆ భగవంతుడు చేస్తే అప్పుడర్థమవుతుంది 'మోజు' తగ్గిపోవడం అంటే ఏమిటో.

అయినా తను మరీ అంత అసహ్యంగా వుండదే! తనకు తెలిసిన పద్ధతులు అన్నీ వుపయోగించి తెలియని పద్ధతులు 'బ్యూటీక్లినిక్స్' ద్వారా తెలుసుకొని మరీఅందంగావుండాలని ప్రయత్నిస్తుందే!

అలాగయినా భర్తను తను ఆకర్షించలేకపోతూ దంటే అది స్త్రీకి దేవుడిచ్చిన శాపమా?!

16 ఏళ్ళ కన్నెపిల్లలా 25 ఏళ్ళ ఆడది ఎలా వుండగలదు? ఛీ ... ఇద్దరు పిల్లలని భర్తకు కనిచ్చి మరో కన్నెపిల్లని అతడికి కట్టబెట్టి ప్రతివాడి పెళ్ళాం ఉరిపోసుకొని చచ్చిపోవాలి.

అప్పటికైనా ఈ మగవాళ్ళకి బుద్ధొస్తుందా? ఎలాగొస్తుంది...? ఈ పద్ధతి మరీ బాగుందని తెగ సంబరపడి సంతోషపడిపోతారు.

వెగటు జీవితపు ఆలోచనలలో మునిగిపోయి తేరుకోలేకపోతూంది అరుంధతి. కాలింగ్ బెల్ శబ్దం వినబడగానే వెళ్ళి తలుపుతీసింది ఆమె. పిల్లలిద్దరూ రిక్షా దిగి లోపలకు వచ్చారు. వాళ్ళు చాలా ఆనందంగా వున్నారు. కారణం ... ఆమెకూ తెలుసు. వాళ్ళు తండ్రితో సినిమాకు వెళ్తున్నారు. తండ్రి ఆఫీసు నుండి వచ్చేసరికి అంటే మరో అర్థగంటకి టాయిలెట్ అయి రెడీగా వుంటే ... తండ్రి రాగానే టాక్సీలో పిక్చర్‌కి వెళ్ళొచ్చు. అమ్మ రాదని వాళ్ళకి తెలుసు. అమ్మకు సినిమాలు చూడడం ఇష్టం వుండదని వాళ్ళ వూహ. ఒకటి రెండుసార్లు సినిమాకు రమ్మని వాళ్ళిద్దరూ అడిగారు. తండ్రి కోప్పడడంతో ఆ తర్వాత అడగడం మానేశారు.

అరగంటలో ఇద్దరూ 'రెడీ' అయ్యారు. శ్రీహరి బైట నుండే హారన్‌తో పిల్లలని రప్పించుకొని తీసుకువెళ్ళిపోయారు. తలుపు పక్కగా నిలబడి గమనిస్తున్న అరుంధతికి గతంలో దుఃఖం ఆగేదికాదు. ఇప్పుడలవాటయిపోయింది.

ఆమె ఆలోచనలతో వాలు కుర్చీలో కూర్చొని పైన తిరుగుతున్న సీలింగ్ ఫేన్ గమనిస్తూంది.

ఎదురుగా సోఫాలో వున్న దినపత్రిక గాలికి ఎగిరి కిందపడిపోయింది. సడన్‌గా ఆమె చూపు ఆ పేపరు మీద పడింది.

'భర్త నిరాదరణకు గురై సీలింగ్ ఫేన్‌కు ఉరిపోసుకున్న స్త్రీ' అన్న వార్త ఆమెకు పెద్ద అక్షరాలతో కనబడింది. ఆతృతగా పేపరుతీసి చదవసాగింది అరుంధతి.

■ ■ ■ ■ ■ ■ ■ ■ ■ ■ ■ ■ ■ ■ ■ ■ ■

శ్రీహరి సినిమాహాలు దగ్గర టాక్సీ పార్కు చేసి టికెట్స్ కోసం బైటకొచ్చాడు. పిల్లలిద్దరూ టాక్సీలోనే వున్నారు. అతనికి దగ్గరగా వున్న గుంపు సంభాషణ వద్దనుకున్నా అతని చెవిలో పడుతూంది.

